క్రమ శిక్షణ అలవర్చుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం అశోక్, సీఈఆర్పీ పోచాని

కౌటాల, జనవరి 2 : విద్యార్థులు విద్యతో పాటు క్రమ శిక్షణను అలవర్చుకోవాలని మొగడ్ధగడ్ ఆశ్రమ గిరిజన పాఠశాల హెచ్ఎం జీ అశోక్ కుమార్ సూచించారు. పలు పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం సీఈఆర్పీ మడావి పోచానితో కలిసి బహుమతులు అందించారు. విద్యార్థులు రాబోయే పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

డ్రైవర్‌కు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐలు తిరుపతి, శంకర్

వాంకిడి, జనవరి 2 : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు తప్పని సరిగా పాటించాలని వాంకిడి మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్లు టీ తిరుపతి, బీ శంకర్ సూచించారు. రోడ్డు భద్రతా మాహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో గురువారం ద్విచక్రవాహదారులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించి బైకు నడుపాలని, మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. ఆర్టీఏ సిబ్బంది, వాహనదారులు తదితరులు ఉన్నారు.

జీవోను విడుదల చేయాలి

ధర్నా చేస్తున్న సివిల్ సప్లయ్ హమాలీలు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 2 : పెంచిన సివిల్ సప్లయ్ హమాలీ రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద హమాలీలు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజు సందర్భంగా పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా జీవో విడుదల చేయాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి, సివిల్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి సుధాకర్, లొనరే శ్రీనివాస్,బోటుపల్లి ప్రకాశ్, డీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జీపీ ఏర్పాటు చేయండి

కలెక్టర్‌కు వినతి పత్రంతోపాటు పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 2 : మండలంలోని పర్శనంబాల గ్రామాన్ని నూతన జీపీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతి పత్రం అందజేశారు. గ్రామం ప్రస్తుతం రౌటసంకేపల్లి పంచాయతీలో కలిసి ఉందని, దీంతో ఇబ్బందు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

వాంకిడి, జనవరి 2 : రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న పేద, బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబడే లహుకుమార్ డిమాండ్ చేశారు. లేకపోతే వేలాది మంది విద్యార్థులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. 8వ తేదీన జరిగే బీసీల సమర శంఖారావం వాల్ పోస్టర్లను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర వృత్తి విద్యాకోర్సులు చదువుతున్న 12 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడతో ఇబ్బందులుపడుతున్నారన్నారు. దీంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ధ్రువ పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నాయిన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లోబడే ఉమేశ్, వినోద్, మహేశ్, మహేందర్, తిరుప తి, స్వాతి, స్వప్న, రోజ, ప్రమీల, పాయల్, హర్షిత, నవ్య, మాయ పాల్గొన్నారు.

ఆనంద్ మేళా సిల్వర్ జూబ్లీ వేడుకలు

జ్ఞాపికలు అందిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

కాగజ్‌నగర్, జనవరి 2 : ఆనంద్ మేళా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా రాష్ట్ర భాషా సాంస్కృతి శాఖ సౌజన్యంతో, మోక్షిత డాన్స్ అకాడమీ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సిర్పూర్ పేపర్ మిల్లు మైదానంలో జాతీయ నంది పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హరీశ్ బాబు, ఎస్పీం అడిషనల్ జీఎం గిరీశ్ బాబు, డాక్టర్ విద్యాసాగర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ధూంధాం కళాకారులు కళాకారులకు పురస్కారాలు అందించారు. రాష్ట్ర ధూంధాం వ్యవస్థాపక సభ్యుడు అంతడపుల నాగరాజు, సీనియర్ ఉద్యమ ఉత్తమ గాయకుడు కుమ్రం భీం ఆసిఫాబాద్ టీటీఎస్ టీం లీడర్ కొప్పర్తి సురేందర్, ఓయూ జేఏసీ నేత, కవి, గాయకుడు దరువు అంజన్న, తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అనువోజు వెంకటేశం, తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్ కుమార్, ఉద్యమ కవి, గాయకుడు సుందిళ్ల రాజన్న, తెలంగాణ ఉద్యమ గాయకుడు, సీనియర్ ఉద్యమ కళాకారుడు మహమ్మద్ ఇర్ఫాన్ హుస్సేన్, కనక రాజు గుస్సాడీ టీం లీడర్ మార్లవాయి, కనక సురేందర్, పద్మశ్రీ మేడి కార్తీక్, సీనియర్ ఉద్యమ కళాకారులకు పురస్కారాలు అందించారు. పట్టణంలో వివిధ వార్డులు, మండలాల నుంచి కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా ప్రచురణకు సిద్ధం

- నమోదుకు జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 ప్రామాణికం
- ప్రజలందరికీ తెలిసేలా వివిధ కార్యక్రమాలు
- ఓటర్ల జాబితా పరిశీలకుడు సురేంద్రమోహన్
- జిల్లాలో సమర్థవంతంగా జాబితా సవరణ
- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

మాట్లాడుతున్న ఓటర్ల జాబితా పరిశీలకుడు సురేంద్రమోహన్

నస్పూర్, జనవరి 2 : ఓటరు జాబితా సవరణ-2025లో భాగంగా చేపట్టిన ప్రక్రియ పూర్తిచేసుకొని తుది ఓటరు జాబితా ప్రచురణకు సిద్ధం చేసినట్లు ఓటర్ల జాబితా పరిశీలకుడు సురేంద్రమోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, చెన్నూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళతో కలిసి ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరు జాబితాలో తమ వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు, రెండు, మూడు ఎపిక్ కార్డులు కలిగినా, చిరునామా మారిన, మరణించిన వారి వివరాలు, మార్పులు తొలగింపులపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. భారత ఎన్నికల సంఘం ఓటరు నమోదు చేసుకునేందుకు జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీలను ప్రామాణికంగా తీసుకుంటుందని చెప్పారు. ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ముసాయిదా జాబితాపై వచ్చిన 433 ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి, 427 పరిష్కరించామని తెలిపారు. 23,967 ఎపిక్ కార్డులకు గాను, 8074 కార్డులు తయారై, పంపిణీ చేశామని వెల్లడించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

సింగరేణి భవిష్యత్‌కు ప్రాధాన్యమివ్వాలి

- ప్రతీ ఉద్యోగి పనిగంటలు పెంచుకోవాలి
- సీఎండీ బలరాం

శ్రీరాంపూర్, జనవరి 2 : సింగరేణిలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి సంస్థ భవిష్యత్‌కు ప్రాధాన్యమిచ్చి, పని గంటలు పెంచుకోవాలని సీఎండీ బలరాం సూచించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులకు సమాజంలో మంచి గౌరవం ఉందన్నారు. ఉన్నతస్థాయిలో రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్, జీఎం కో ఆర్డినేటర్ ఎం సుభానీ, జీఎం మార్కెటింగ్ రవి ప్రసాద్, జీఎం సోలార్ సూర్యనారాయణ రాజు తదితరలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీని పరామర్శిస్తున్న ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్

జాన్సన్ నాయక్ పరామర్శ

జన్నారం, జనవరి 2 : జన్నారం మండలంలోని పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొంది ఇంటికి తిరిగి రాగా, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ గురువారం పరామర్శించారు. పొనకల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మాదాడి సరోజన (మొకాళ్ల అపరేషన్), సింగిల్ విండో మాజీ చైర్మన్ శీలం రమేశ్ (గుండెనొప్పి శాస్త్ర చికిత్స)ను వారి ఇళ్లకు వెళ్లి కలిశారు. వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్‌కుమార్, ఫజల్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, టౌన్ అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్‌గౌడ్, నర్సాగౌడ్ వోలాల, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధికి దోహదపడాలి

మందమర్రి, జనవరి 2 : కొత్త సంవత్సరంలో సింగరేణి ఉద్యోగులు ఉత్సాహంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి దోహదపడాలని మందమర్రి ఏరియా జీఎం జీ దేవేందర్ సూచించారు. ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొని, కేక్‌కట్ చేశారు. ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు జీఎం కార్యాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధినిస్తున్నదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు నెలలే గడువు ఉన్నందున అధికారులు, కార్మికులు సమష్టి కృషితో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సీఎంవోఏఐ అధ్యక్షుడు రవి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, డీజీఎం(ఈ అండ్ఎం) ఎం వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి, ఏరియా సర్వే ఆఫీసర్ బందోపాధ్యాయ, ఎస్‌కే గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్, క్వాలిటీ ఇన్‌చార్జి ప్రదీప్, పర్చేస్ అధికారి బాబు, సెక్యూరిటీ ఆఫీసర్ రవి, డీవైపీఎం ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పత్రాలను అందజేస్తున్న మందమర్రి జీఎం దేవేందర్

ఉత్సాహంతో లక్ష్యాలు సాధించాలి

రెబ్బెన, జనవరి 2 : బెల్లంపల్లి ఏరియా ఉద్యోగులు నూతనోత్సాహంతో విధులు నిర్వహించి, సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. గోలేటి జీఎం కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించి, కేక్ కట్ చేశారు. ఏరియాకు స్వచ్ఛతా విభాగంలో ద్వితీయ బహుమతి రావడం అభినందనీయమన్నారు. 136 ఏళ్ల చరిత్ర ఉన్న సింగరేణి సంస్థను భావితరాలకు అందించేందుకు ప్రతీ ఉద్యోగి కృషిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఐదుగురు ఉద్యోగులకు ఉద్యోగోన్నతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పీవో మచ్చగిరి నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ (ఎస్ఈ) మదీనా బాషా, సీనియర్ పీవోలు శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛత ట్రోఫీతో ఏరియా జీఎం శ్రీనివాస్, ఉన్నతాధికారులు

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు

హాజీపూర్, జనవరి 2 : జిల్లాలో తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతున్నది. హాజీపూర్ మండలం గుడిపేటలోని 1వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ వెంకట్రాములును కలిసి పూల మొక్క అందించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సభ్యత్వం నమోదు చేశారు. అలాగే తహసీల్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండేను కలిసి పుష్పగుచ్ఛం అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. కార్యాలయంలోని ఉద్యోగులకు టీఎన్జీవో సభ్యత్వ రసీదులను అందజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఆర్ఐలు ప్రభు, మంగ, ఉద్యోగులు పాల్గొన్నారు.

బెటాలియన్ కమాండెంట్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధ్యక్షుడు శ్రీహరి

బ్లాంకెట్లు, టార్పాలిన్ల పంపిణీ

నెన్నెల, జనవరి 2 : మారుమూల కోణంపేట గ్రామంలో గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 70 మందికి బ్లాంకెట్లు, టార్పాలిన్స్, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఎస్ఐ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, అందించారు. అనంతరం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. సికిల్ సెల్ బాధితులు, గర్భిణులకు అత్యవసర పరిస్థితిలో రెడ్‌క్రాస్ రక్త దానం చేస్తున్నదని తెలిపారు. వృద్ధాశ్రమం, అనాథాశ్రమం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నదన్నారు. ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జనరల్ సెక్రటరీ మహేందర్, సురభి శరత్ కుమార్, అభినవ సంతోష్‌కుమార్, లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ భారతీశంకర్, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, గ్రామస్తులు బాపురెడ్డి, మందన్న, తోడే బాపు, అంజయ్య, శంకర్, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాంకెట్లు, టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు

ఓరియంట్ క్వారీలో దారిని కొనసాగించేందుకు హామీ

కాసిపేట, జనవరి 2 : కాసిపేట మండలం దేవాపూర్ ఫారెస్ట్ పరిధిలోని ఓరియంట్ క్వారీలో దారిని యథావిధిగా కొనసాగించేందుకు అధికారులు హామీ ఇచ్చారని ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. ఏళ్ల నుంచి నడిచే క్వారీ దారిలోని గేటును పెద్దపులి తిరుగుతుందనే నెపంతో అటవీ శాఖ ఆదేశాల మేరకు ఓరియంట్ అధికారులు మూసివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో దేవాపూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారులతో పాటు, ఓరియంట్ యాజమాన్యంతో దారి విషయమై చర్చించారు. దీంతో అధికారులు సానుకూలంగా స్పందించి, యథావిధిగా గేటు దారి కొనసాగుతుందని హామీ ఇచ్చారని ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. ఆదివాసీ గ్రామ సభల అనుమతి లేకుండా తమ ప్రాంతాల్లోని దారులను మూసివేయవద్దని, సాగు చేసుకుంటున్న భూములను అధికారులు స్వాధీనం చేసుకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కొమ్ముల బాపు, గ్రామ పటేళ్లు, మాజీ సర్పంచులు, ఆదివాసీ సంఘాల నాయకులు కొమ్ముల బాపు, మడావి అనంతరావు, ఆడె జంగు, పెంద్రం రాజు, అచ్యుత్ రావు, కనక రాజు, వెడ్మ బాపురావ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఒకరికి ఏడాది జైలు

జన్నారం, జనవరి 2 : మండల కేంద్రంలోని ఉడిపి హోటల్ వద్ద నిలిపి ఉంచిన బైక్‌ను దొంగిలించిన మూటపెల్లి పవన్‌కు లక్షెట్టిపేట కోర్టు జడ్జి ఏడాది కఠిన గారాగార శిక్ష విధించినట్లు ఎస్ఐ రాజవర్ధన్ గురువారం తెలిపారు. 2024, జూలై 30న మండల కేంద్రంలోని ఉడిపి హోటల్ వద్ద కరీంనగర్‌కు చెందిని మహ్మద్ పల్సర్ బైక్ పార్క్ చేసి ఉంచాడు. కాగా, పవన్ దానిని దొంగిలించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అదే సమయంలో హైదరాబాద్, నిజామాబాద్, ఆర్మూర్‌లో 14 బైకులు దొంగిలించిన కేసులో ఏ1 నిందితుడు. కాగా, గురువారం కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువుకావడంతో శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హెచ్ఎం మృతి

గంగాధర్ (ఫైల్)

వాంకిడి, జనవరి 2 : వాంకిడి మండలంలోని కమానా గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవేగూడ ప్రాథమిక పాటశాల ప్రధానోపాధ్యాయుడు తోట గంగాధర్ (30) మృతిచెందినట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన తోట గంగాధర్ నవేగూడలో హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం కాగజ్‌నగర్ వైపు నుంచి వాంకిడి వస్తున్న సమయంలో కమానా సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయాలవగా, స్థానికులు అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గంగాధర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 2 : జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి జర్నలిస్టులకు గురువారం అందజేశారు. మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గాధవేని మల్లేశ్, నాయకులు చరణ్, అబ్దుల్లా, అసద్, విశాల్, సలాం, జర్నలిస్టులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

నస్పూర్, జనవరి 2 : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో కొనసాగుతున్న సీఎం కప్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో మంచిర్యాల జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటస్వామి, రామారావు గురువారం తెలిపారు. శ్రీహర్షిణి (బంగారు), పూనం చౌదరి (వెండి), కిశాన్, కార్తీక్, మారుతి (కాంస్య) సాధించినట్లు పేర్కొన్నారు. శిక్షకులు శ్రీనివాస్, శ్రావణ్, ప్రసాద్, అరుణ్ అభినందించారు.

5వ తేదీ వరకే కొనుగోళ్లు

కౌటాల, జనవరి 2 : ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ నెల 5వ తేదీ వరకే కొనసాగుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో రాజేశ్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కౌటాల మండలంలోని కుంబారి, కౌటాల, వీరవెల్లి, చింతలమానేపల్లి మండలంలోని రవీంద్ర నగర్, చింతలమానెపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

'రౌడీ షీటర్లను పెంచిపోషిస్తున్న ఎమ్మెల్యే'

బెల్లంపల్లి, జనవరి 2 : ఎమ్మెల్యే గడ్డం వినోద్ రౌడీషీటర్లను పెంచి పోషిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ ఆరోపించారు. ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆరిజన్ డైయిర్ సీఈవో కందిమల్ల ఆదినారాయణను గురువారం పరామర్శించి, మాట్లాడారు. భూ కబ్జాలకు పాల్పడుతున్న వారిని వినోద్ కాపాడుతున్నాడని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరి కబ్జాలు చేస్తున్న వారిని పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే వినోద్‌ను కూడా ప్రజలు హైదరాబాద్‌కే పరిమితం చేస్తారని హెచ్చరించారు. వెంటనే నిందుతులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులపై శ్రద్ధచూపాలి

కౌటాల, జనవరి 2 : చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో గావుడే హన్మంతు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాబోధన, విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఎఫ్ఎల్ఎన్ పరీక్ష ప్రశ్న పత్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారాన్ని బోధించాలని, మానవతా విలువలు, నీతి కథలు విద్యార్థులకు ఈ దశ నుండే చెప్పాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం గణపతితో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పెంచికల్ పేట్, జనవరి 2 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఎస్ఐ కొమురయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జీ యాదగిరి జిల్లా ఉపాధ్యక్షురాలు గంగాభవాని, ఉపాధ్యాయులు బడే సాహెబ్, లక్ష్మి, సంతోష్, భారతి, ప్రియాంక, తిరుమల, అయేషా, అంజూమ్ అఫ్తాబ్, ఈశ్వరరావు, ధనరాజ్, ఆత్మారాం, ఉజ్వల, భాగ్యశ్రీ, నాగరాణి, సాదియా తదితరులు పాల్గొన్నారు.

రాయితీ వరి విత్తనాలు పంపిణీ

రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఏవో రామకృష్ణ

దహెగాం, జనవరి 2 : ప్రభుత్వం రైతులకు అందించే రాయితీ వరి విత్తనాలను గురువారం పంపిణీ చేసినట్లు ఏవో రామకృష్ణ తెలిపారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ ద్వారా వంద శాతం రాయితీపై మంజూరు కాగా, మండలంలోని వివిధ గ్రామాల రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సీసీ డ్రెయిన్ పనులు ప్రారంభం

శ్రీరాంపూర్, జనవరి 2 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధి శ్రీరాంపూర్ ఆర్కే 8 భగత్‌సింగ్‌నగర్‌లో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులను గురువారం కౌన్సిలర్ పూద కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.18 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో మురుగు కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దూడ లచ్చయ్య, మల్లేశ్, ఓదెలు పాల్గొన్నారు.